క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం


అమరేందర్‌రెడ్డి, కమిషనర్

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళా ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ కె. అమరేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విధి నిర్వహణలో వ్యక్తిగత, శాఖల వారీగా నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన మహిళలకు ఈ అవార్డులు అందజేస్తారని చెప్పారు. ఉమెన్స్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత 2023 ద్వారా మహిళలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మహిళలు వ్యక్తిగత, స్వయం సహాయ, చిన్న తరహా సామాజిక, మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకుల పరిశుభ్రత, శానిటేషన్, వ్యర్థాల శుద్ధీకరణ, తడి, పొడి చెత్త సేకరణ, అదే నెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీ వంటి విభాగాల్లో నిర్వహిస్తున్న మహిళలకు ఈ అవార్డులు అందజేస్తారని వివరించారు. ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్న వివరాలకు ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

వివాహానికి చేయూత


బియ్యం అందజేస్తున్న బంటి యూత్ ఫోర్స్ సభ్యులు

మంచాల: మండల పరిధిలోని నోముల గ్రామంలో బంటి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం బియ్యం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబీకులైన పల్నాటి సుజాత, రాజు దంపతుల కుమార్తె వివాహానికి క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు. దాత, వార్డు సభ్యుడు చింతకింది వీరేశ్ ముదిరాజ్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంటి యూత్ ఫోర్స్ సభ్యులు విష్ణు, శంకర్, మహేశ్, ప్రశాంత్, రాజు, సాయి, బాలకృష్ణ, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి జెడ్పీటీసీ సాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని చీపునుంతలకు చెందిన కొట్ర సుశీల నూతన ఇంటి నిర్మాణం చేపట్టింది. డబ్బులు లేక మధ్యలోనే ఇంటి నిర్మాణాన్ని నిలిపి వేసింది. సర్పంచ్ రఘుపతి సహకారంతో జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్‌ను కలిసి ఆర్థికసాయం అందించాలని కోరారు. వెంటనే స్పందించిన జెడ్పీటీసీ ఉప్పల ఛారిటబుల్ ట్రస్టు నుంచి ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. శుక్రవారం ట్రస్టు సభ్యులు ఇసుక, సిమెంట్, స్టీల్, ఇటుక తదితర మెటీరియల్‌ను ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రఘుపతి, తదితరులు ఉన్నారు.

ఏవీఎన్‌రెడ్డి గెలుపు.. ఉపాధ్యాయుల విజయం

బీజేపీ కార్యవర్గ సభ్యుడు భాస్కర్

ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన టీపీయూఎస్ (తపస్) అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి విజయం ఉపాధ్యాయుల విజయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ముత్యాల భాస్కర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ పని తీరుతో ఉద్యోగులు విసిగిపోయారన్నారు. ఉపాధ్యాయులంతా సంఘటితంగా కేసీఆర్ పాలనతీరును ఎండగట్టేలా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీర్పునిచ్చారన్నారు. ఏవీఎన్ రెడ్డి గెలుపునకు కృషిచేసిన ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

పట్నంలో తగ్గిన వర్షం

ఇబ్రహీంపట్నం: వాతావరణంలో మార్పుల ప్రభావంతో గురువారం మధ్యాహ్నం నుంచి ఈదురుగాలులతో కురుసిన వర్షం శుక్రవారం పూర్తిగా తగ్గింది. ఉదయం 9గంటల వరకు ఓ మోస్తారు వర్షం కురిసి ఆగిపోయింది. మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రజలు ఆందోళన చెందారు. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు ఇబ్రహీంపట్నంలో 24.2 మి.మీ. దండుమైలారంలో 5.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ముగిసిన పంచమ వార్షికోత్సవం


శాంతి కల్యాణంలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు

మీర్‌పేట: మీర్‌పేట ఓల్డ్ గాయత్రినగర్‌లోని శారదా లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవాలు గురువారంతో ముగిశాయి. రాత్రి లక్షపుష్పార్చన, శాంతి కల్యాణంతో ఘనంగా నిర్వహించారు. టీటీడీ ప్రధాన వ్యాఖ్యాత డా.డీ.వి.హయగ్రీవాచార్యులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వెంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు వంటేరు నర్సింహారెడ్డి, సభ్యులు మధుసూదన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించండి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి


ఇళ్లు దెబ్బతిన్న బాధితులతో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

- ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి
- గ్రామాల్లో పర్యటించాలని మంత్రి నిరంజన్‌రెడ్డికి ఫోన్

యాచారం: వడగళ్ల వానను ప్రకృతి వైపరీత్యంగా పరిగణించి రైతులకు న్యాయ పరిహారం అందించాలని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మంతన్‌గౌరెల్లి గ్రామంలో పర్యటించి ఇళ్లు, పంట నష్టపోయిన రైతులను, గాయాలపాలపైన వృద్ధులను పరామర్శించారు. అనంతరం మంత్రి నిరంజన్ రెడ్డికి ఫోన్‌చేసి సమస్యను వివరించారు. గ్రామాల్లో పర్యటించి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం సీపీఎం బృందం సభ్యులు పి.జంగారెడ్డి, జగన్, అంజయ్య, చందునాయక్‌తో కలిసి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రతీ సంవత్సరం వడగళ్లు కురిసి వరి, కూరగాయల, పండ్ల తోటలు పూర్తిగా నష్టపోతున్నామన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం నేటి వరకు దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంతన్‌గౌరెల్లి బాధిత కుటుంబాలను ఆదుకోకపోతే జీవనోపాధి లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురిస్తుందని అన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు దెంది రాంరెడ్డి, మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతినాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అరవింద్‌నాయక్ పాల్గొన్నారు.

స్పందించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

వడగళ్ల వానకు ఇళ్లు, పంట నష్టపోయిన రైతులకు తక్షణసాయంగా రూ.లక్ష అందజేయాలని.. ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే సోమవారం కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. శుక్రవారం ఆయన మంతన్‌గౌరెల్లి గ్రామంలో పర్యటించిన బాధితులకు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ స్వయంగా గ్రామంలో పర్యటించి బాధితుల గోడు తెలుసుకోవాలన్నారు. రేకుల ఇళ్లు దెబ్బతిన్న 450 మంది పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన వరి, కూరగాయల, పండ్ల తోటలను సమగ్ర సర్వే చేసి ఎకరాకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం అందించాలన్నారు. క్షతగాత్రులను ప్రవేట్ ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అదే విధంగా మంతన్‌గౌరెల్లి గ్రామ పర్యటనలో ఉన్న ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటాచారిని కలిసి బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మంకాల దాసు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో బీజేపీ రాజకీయం

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: నిరుద్యోగుల జీవితాలతో బీజేపీ రాజకీయం చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో వరుస ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లను వేయడంతో జీర్ణించుకోలేకే బీజేపీ కుట్రలు చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేయడంతో బీజేపీ జీర్ణించుకోలేక పేపర్ లీకేజీలకు పాల్పడుతోందని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం సాగిస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధిచెప్పాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ గోరటి శ్రీను, అంజినాయక్, నాయకులు సుభాశ్, నాగులునాయక్, శత్రునాయక్, శివకుమార్, రాజశేఖర్, గోపి, ప్రశాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఇంగ్లిష్ పరీక్షకు 167మంది గైర్హాజరు

షాద్‌నగర్: ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షను శుక్రవారం నిర్వహించారు. షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఏడు కేంద్రాల్లో 2,684 మంది విద్యార్థులకు గాను 2,517 మంది పరీక్షలు రాయగా, 167మంది గైర్హాజర య్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 481 మంది గాను 453 మంది, మొగిలిగిద్ద ప్రభుత్వ కళాశాలలో 223మంది గాను 214 మంది, ప్రతిభ కళాశాలలో 361 మందికి గాను 335మంది, విశ్వభారతి కళాశాలలో 495 మందికి గాను 475 మంది, విజ్ఞాన్ కళాశాలలో 576మందికి గాను 534మంది, విజేత జూనియర్ కళాశాలలో 341మందికి గా ను 317మంది, శ్రీసాయి ఒకేషనల్ కళాశాలలో 207మందికి గాను 189 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఇంటర్ పరీక్షల కస్టోడియన్ అధికారులు శ్రీకాంత్, కిష్టప్ప తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


ఈదమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఈదమ్మ తల్లి విగ్రహం ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం మాడ్గులకు చెందిన శ్రీనివాస్, బీరయ్య, సత్యమ్మ, నసీమా బేగం, తానయ్య, పద్మ, అలివేలు, శ్రీను, వెంకటమ్మ, కొల్కులపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, రఘుమారెడ్డిలకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మాడ్గుల సర్పంచ్ అంబల్ల జంగయ్యగౌడ్, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, నాయకులు లాలయ్యగౌడ్, బట్టు ధర్మారెడ్డి, యాదిరెడ్డి, జంగయ్యయాదవ్, రాములుయాదవ్, భూపతిరెడ్డి, వెంకటయ్య, యాదయ్యగౌడ్, కృష్ణారెడ్డి, తిరుపతయ్య, మహేశ్ పాల్గొన్నారు.

మురుగు నుంచి విముక్తి కల్పించిన ఘనత మాదే

బీఆర్ఎస్ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి


కుంట్లూర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

హయత్‌నగర్: ఎన్నో ఏళ్లుగా మురుగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న కుంట్లూర్ వాసులకు మురుగు నీటి సమస్య నుంచి విముక్తి కల్పించిన ఘనత ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికే దక్కుతుందని బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రగతి నివేదన యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుంట్లూర్ నుంచి మురుగు నీటిని తరలించేందుకు రూ.16కోట్లు ఖర్చు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. కుంట్లూరు అభివృద్ధికి అనుగునంగా పనులు చేపట్టాల్సి ఉందన్నారు. గ్రామంలోని 99, 100 సర్వే నెంబర్లలో ఇళ్లు నిర్మించుకున్న వారి సమస్యను ఎమ్మెల్యేకు వివరించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశంతోనే ఈ యాత్ర చేపట్టానని వివరించారు. శుక్రవారం 700 కిలో మీటర్లు పాదయాత్ర పూర్తైన సందర్భగా పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఈదమ్మల బలరాం, గోవర్ధనం ప్రవీణ్ కుమార్, గౌని భాస్కర్‌గౌడ్, కళ్లెం ప్రభాకర్‌రెడ్డి, జోర్క రాముముదిరాజ్, వెంకటేశ్‌గౌడ్, కౌన్సిలర్ చెవుల హరిశంకర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

రేపు పంచాంగ పఠనం

వనస్థలిపురం: శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 19న పంచాంగ పఠన కార్యక్రమం ఉంటుందని వేదభూమి సంస్థ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6.05 గంటలకు వనస్థలిపురంలోని శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మశ్రీ దేవులపల్లి పవనకుమార సిద్ధాంతిచే పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. కార్యక్రమాని హాజరైన వారందరికీ శ్రీశోభకృత్-ఉగాది పంచాంగాన్ని అందించనున్నట్లు తెలిపారు.

322 మందికి కంటి పరీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్, పెద్దూర్‌తండా కంటి వైద్య శిబిరాల్లో శుక్రవారం 332 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు వైద్యులు సైదమ్మ, కల్పన, స్నేహ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏలు మల్లయ్య, రామచంద్రయ్య, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె ప్రగతి పనుల పరిశీలన

ఆమనగల్లు: మాడ్గుల మండలం ఫిరోజ్‌నగర్ పంచాయతీలో కొనసాగుతున్న పల్లెప్రగతి పనులు శుక్రవారం ఎంపీడీఓ రాఘవులు పరిశీలించారు. ఫిరోజ్‌నగర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం హరితహారం నర్సరీ, ఈజీఎస్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫిరోజ్‌నగర్ సర్పంచ్ వెంకటమ్మ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ కాలనీకి చెందిన యాదయ్యకు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.27 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం కేఎన్ఆర్ సేవాదళం అధ్యక్షుడు మెకానిక్ బాబా బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు విజయ్‌రాథోడ్, నాగిళ్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

కృతిమ ఇసుక ఫిల్టర్లు ధ్వంసం

తలకొండపల్లి: కృతిమ ఇసుక తయారుచేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ కృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని చెన్నారం, యడవల్లి, చుక్కాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. కృతిమంగా తయారు చేస్తున్న నాలుగు ఇసుక ఫిల్టర్లను గుర్తించారు. వాటిని జేసీబీతో నేల మట్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ సంతోశ్, ఆర్ఐ మంజుల, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపాన్ని నివారించండి


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన-అక్షరాభ్యాసం కార్యక్రమం

సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి

తలకొండపల్లి: పౌష్టికాహార లోపాన్ని నివారించి పిల్లల ఆరోగ్య ఎదుగుదలకు తోడ్పడాలని సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. సంపూర్ణ ఆరోగ్య దిశగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. మండల పరిధిలోని రాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన-అక్షరబ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందదర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మాతా, శిశు మరణాల రేటును తగ్గించాలన్నారు. అంగన్‌వాడీలో పంపిణీ చేసే బాలామృతం, తదితర పౌష్టికాహారంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, కార్యకర్త పద్మ, సునీత, జంగమ్మ, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల వివరాల సేకరణ

12 ఎకరాల్లో మామిడి, పది ఎకరాల్లో ఆముదం పంటలకు నష్టం

ఆమనగల్లు: వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను శుక్రవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఏఈఓలు రాణి, నిఖిత మండల పరిధిలోని కోనాపూర్, సాకిబండ తండాల్లో పర్యటించి పంట నష్టం వివరాలు సేకరించారు. కోనాపూర్ గ్రామంలో 12 ఎకరాల్లో మామిడితోటలు దెబ్బతినట్లు అధికారులు గుర్తించారు. సాకిబండ, కోనాపూర్ గ్రామాల్లో పది ఎకరాల్లో ఆముదం పంట దెబ్బతిన్నట్లు ఏఈఓలు రాణి, నిఖిత తెలిపారు.


సాకిబండతండాలో దెబ్బతిన్న ఆముదం పంటను పరిశీలిస్తున్న ఏఈఓ రాణి

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి


చంద్రధనలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ, తదితరులు

ఏఓ రాజు

తలకొండపల్లి: రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ.. సస్యరక్షణ చర్యలు తీసుకుంటే పంటల దిగుబడి పెరిగి ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి రాజు అన్నారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ పంటలకు సోకే తెగుళ్లను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని చంద్రధన, పూల్‌సింగ్ తండాల్లో ఆయన పర్యటించారు. వరి, వేరుశనగ, మొక్కజొన్న, తదితర పంటలను పరిశీలించారు. తెగుళ్ల బారిన పడకుండా తగు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాల నుం చి పటలను ఎలా కాపాడుకోవాలో, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ నిఖిత, చందు, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన వారికి న్యాయం చేయండి


రైతులతో మాట్లాడుతున్న యాదీలాల్

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యాదీలాల్

ఆమనగల్లు: వడగళ్ల వానతో పంటలు కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి యాదీలాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పర్యటించి రైతులతో మాట్లాడారు. అకాల వర్షాలతో గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయని.. పలు గ్రామాల్లో ధాన్యం తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈదురు గాలులకు మామిడి తోటల్లో కాయలు నేలరాలాయని, అనేక చోట్ల పౌల్ట్రీ షెడ్లు కూలిపోయాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన ప్రతీ ఒక్కరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాలె మల్లయ్య, కుమార్ గౌడ్, నరేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

దోభీ ఘాట్ నిర్మాణానికి రూ.2కోట్లు

ఇబ్రహీంపట్నం: పట్టణంలో దోభీ ఘాట్ నిర్మాణానికి మంత్రి కేటీఆర్ రూ.2లక్షల నిధులు కేటాయించారని మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, కౌన్సిలర్ ముత్యాల భాస్కర్, రజకులతో కలిసి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా స్థల పరిశీలన పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


స్థల పరిశీలన చేస్తున్న చైర్‌పర్సన్ స్రవంతి

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం


పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ ఫేస్-1లోని శ్రీదేవి పోచమ్మ, దాసాంజనేయ, శ్రీ కాశీవిశ్వనాథ స్వామి వార్ల ఆలయ ధ్వజ స్తంభం, అమ్మవారి సింహవాహన యంత్ర ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ... ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పురుషోత్తంరెడ్డి, సాయిబాబు, భిక్షపతి, నాయకులు రఘురామ్, మంగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి

కందుకూరు: కంటి వెలుగు పథకాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని దాసర్లపల్లి సర్పంచ్ పి.బాలమణిఅశోక్, ఎంపీటీసీ సభ్యురాలు టి.ఇందిరదేవేందర్ సూచించారు. శుక్రవారం వారు మండల పరిధిలోని దాసర్లపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు గ్రామాల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ సాయిసౌమ్య, సీహెచ్ఓ రహీం దర్, పంచాయతీ కార్యదర్శి ప్రియదర్శిని, వార్డు సభ్యుడు కె.యుగంధర్‌గౌడ్, నాయకులు జె.దయాకర్, జె.యాదయ్య, వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది శ్రీనివాస్, బండమ్మ, ప్రేమలత, యాదగిరి, మంజుల, మమత, మాధవి, అండాలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు